

## రసీదు లేని రూ.1.20 లక్షల నగదు సీజ్

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసు శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. సోమవారం అంగళ్లులో పోలీసులు వాహనాల తనఖీ నిర్వహించి నగదును సీజ్ చేశారు. మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్లులో ఎన్నికల నిబంధనల దృష్ట్యా తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి కడప వైపు వెళుతున్న ఓ కారులో రూ.1.20 లక్షల నగదు పట్టుబడిందన్నారు. నగదుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లరాదన్నారు. ఒకవేళ నగదును తీసుకువెళ్లాల్సి ఉంటే తప్పనిసరిగా రసీదు కలిగి ఉండాలన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## మాధవరం 'ఆత్మహత్యల'పై సమగ్ర విచారణ చేపట్టాలి

- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- డిఎస్‌పి షరీఫ్ ప్రకటనలపై అనుమానాలు
- నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కూతురు వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించి శిక్షించాలని, కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, పెద్ద కూతురు లక్ష్మిప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు జి.లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, ఆప్ జిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా కృష్ణ, సిఆర్‌వి ప్రసాద్ హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అధికారులు, అధికార పార్టీ నేతల భూ ధన దాహానికి అమాయక కుటుంబం బలి కావడం విచారకరమన్నారు. మృతుడు సుబ్బారావు తండ్రి పాల చలపతి సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం అట్లూరు మండలంలోని భూములు, ఇల్లు త్యాగం చేసి, ఒంటిమిట్ట మండలంలోని మాధవరం గ్రామంలో నివాసం ఉంటూ, ఒంటిమిట్ట గ్రామ పొలంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకునేవారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదు చేయించుకున్న చలపతి కరోనా సమయంలో చనిపోయారని, తన రెండో కుమారుడైన సుబ్బారావు ఇద్దరూ కుమార్తెల చదువు, తమ్ముడు వివాహం, ఆర్థిక సమస్యలు ఒకవైపు, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి మరోవైపు రావడంతో తన తండ్రి ద్వారా సంక్రమించిన ఏకైక ఆస్తి మూడు ఎకరాల భూమిని విక్రయించైనా అప్పులు తీర్చు కుందామని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. అప్పుడే తహశీల్దార్, స్థానిక వైసిపి నాయకులు కుమ్మక్కై, తన తండ్రి చలపతి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద నమోదు చేయడం దారుణమని తెలిపారు. అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపో వడం, లక్షల రూపాయలు లంచాలు ఇచ్చిన స్పందిం చకపోవడం వంటి కారణాలతో ఆత్మహత్యకు అప్పటి తహశీల్దార్ శిరీష కారణమయ్యారన్నారు. సదరు భూమి పక్కనే నాలుగు లైన్ల రహదారి నిర్మాణం ఉండడం వల్ల వీరి అనుభవంలో ఉన్న భూమి విలువ పెరగడం వల్ల అధికారులు అధికార పార్టీ నేతలు ఒక ప్రణాళిక అబ ద్ధంగానే భూమి వివరాలు నమోదు చేయడంలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ భూములను ఆక్రమించుకుని అమ్ముకుని సొమ్ము చేసుకుని సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఒకే భూమిపై రెండు హక్కు పత్రా లు తయారు చేసే డీకేటీ మాఫియా మండలంలో తయారయిందన్నారు. ఆత్మహత్య చేసుకున్నవారు రెవెన్యూ వారిపై రాసిన మరణ వాంగ్మూలాన్ని ప్రాతిపదికగా తీసుకొని పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ కాకున్నానే అప్పులు వ్యక్తిగత కారణాలతోనే సుబ్బారావు కుటుంబం చనిపోయినట్లు డిఎస్‌పి షరీఫ్ ప్రకటి ంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. ఈ కేసు పై జ్యూడిషియల్ ఎంక్వయిరీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షిం చాల న్నారు. కుటుంబానికి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, వారి భూమి వారికే ఇచ్చేవరకు పోరాటం కొన సాగించాలని, ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.వెంకట శివ, మహిళా సమాఖ్య బసి రున్నిసా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జి వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం సుబ్రహ్మణ్యం, ఇన్సాఫ్ కేసి బాదుల్లా, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, రైతు సంఘం దస్తగిరి రెడ్డి, మనోహర్ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ బాలరాజు, చేనేత కార్మిక సంఘం పల్లా వరప్రసాద్, భాగ్యలక్ష్మి, గిరిజన సమాఖ్య బ్రహ్మం, ఆర్ బాబు, సిపిఐ ఒంటిమిట్ట మండల కార్యదర్శి యానాదయ్య పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

### రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : కర్నూలు ఎంపీ

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**

పాల సుబ్బారావు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు సింగరి సంజీవ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తమాధవరంలో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను పద్మశాలి కుటుంబం నుంచి వచ్చానని, ఆత్మహత్యలకు తనను కలిచి వేశాయని పేర్కొన్నారు. ఇక్కడ పెత్తందారి వ్యవస్థ పేదల రక్తాన్నీ అన్నంలో కలుపుకొని తింటున్నాయని విమర్శించారు. ప్రభుత్వం కబ్జాదారులకు అండగా ఉంటూ పేదల ప్రాణాలను బలికుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చెందిన సొంతభూమి అప్పగించి లక్ష్మీప్రసన్నకు ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్

### ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే : కొల్లు రవీంద్ర

చేనేత కుటుంబం ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని, పాల సుబ్బారావు కుటుంబం రోడ్డున పడటానికి వైసిపి ప్రభుత్వమేనని టిడిపి నాయకులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం మాధవరంలోని మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఫోన్‌లో పాలసుబ్బారావు కుమార్తె లక్ష్మి ప్రసన్నను ఓదార్చి తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. ఆమెకు ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చేనేత కుటుంబం ఆత్మహత్య మనసును కలచివేసిందని పేర్కొన్నారు. పాల చలపతి ఆస్తిని శ్రావణి పేరుతో రెవెన్యూ అధికారులు వైసిపి నాయకుడితో కుమ్మక్కై ఆన్‌లైన్‌లో ఎక్కించారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల దగాకు వైసిపి నాయకులే కారణమన్నారు. టిడిపి తరుపున బాధిత కుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపిస్తామని ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి 'కొల్లు'

### రెవెన్యూ అధికారులే కారణం : పిసిసి

మాధవరంలో చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుని మృతి చెందడానికి రెవెన్యూ అధికారులే కారణమని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆయన కుటుంబం మృతి చెందినట్లు ఓ వర్గం పక్క దారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సోమవారం పూల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాధవరంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు తండ్రి పేరుతో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట బదలాయించలేదా, అది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సుబ్బారావు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగడం వాస్తవం కాదా అన్నారు. సుబ్బారావు కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి స్థానికులు చెబుతున్న వాస్తవాలు వింటే ఆవేదన కలుగుతోందని పేర్కొన్నారు. భూదాహంతో ఓ నిండు కుటుంబాన్ని బలి తీసుకున్న అక్రమార్కులపై వెంటనే చర్యలు చేపట్టి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సుబ్బారావు కుమార్తె చదువులకు ప్రభుత్వం సహకరించి ఆ కుటుంబంపై ఉన్న అప్పుల ఒత్తిడి నుంచి కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సుబ్బారావు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాజంపేట పట్టణ అధ్యక్షులు కనిశెట్టి నరేష్, ఒంటిమిట్ట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిసిసి అధికార ప్రతినిధి పూలభాస్కర్

## శ్రీసీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- ఏప్రిల్ 17 నుంచి శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు
- 22న శ్రీసీతారాముల కల్యాణం
- ఏర్పాట్ల సమీక్షలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 17 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు, 22న కల్యాణం అత్యంత వైభంగా నిర్వహించనున్నామని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ విజయ రామరాజు, ఎస్‌పి సిద్ధార్థ్‌కౌశల్, జిల్లా యంత్రాంగంతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 16న అంకురార్పణ, ఏప్రిల్ 17న శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభవవుతాయన్నారు. 20న హనుమంత వాహనం, 21న గరుడవాహనం, 22న సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న రథోత్సవం, ఏప్రిల్ 25న చక్రస్నానం, 26న పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి, జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్‌టిసిబస్సులు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర విభాగాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ టిటిడి విజిలెన్స్ సిబ్బంది, జిల్లా పోలీసు యంత్రాంగం కలిసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాలలో సిసి కెమరాలు, కంట్రోల్ రూం ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, నరసింహ కిషోర్, ఎస్‌విబిసి సిఇఒ శ్రీ షణ్ముఖ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

## పార్కింగ్‌కు మోక్షమెప్పుడో..?

- జిల్లా కేంద్రంలో స్థలం కరువు
- ఇబ్బందుల్లో వాహనదారులు

**ప్రజాశక్తి- రాయచోటి**

గతంలో వాహనాలు తక్కువగా ఉండేవి ప్రస్తుతం జిల్లా కేంద్రం కావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు ఎక్కువగా ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తుంది. ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే పట్టణాలలో ఆర్‌టిసి బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉంటుంది. కానీ వాహనదారులు రాయచోటి నుంచి ఎక్కడికైనా వెళ్లాలంటే తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న పట్టణాలలోనూ పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఇంత వరకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.పట్టణంలో రద్దీ పెరగడంతో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం పలు ప్రాంతాల నుంచి వాహనాలలో పట్టణానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణంలోని ప్రధాన వీధులలో ఎక్కడ చూసినా ద్విచక్ర వాహనాలు కన్పిస్తున్నాయి. గతంలో ద్విచక్ర వాహనాలు, కార్లను ప్రభుత్వాస్పత్రి, పాత పోలీస్‌స్టేషన్ ఆవరణం, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో పెట్టే వారు. ఇటీవలే ఆర్‌టిసి బస్టాండ్ ప్లాట్‌ఫామ్ పెంచడంతోబస్టాండ్ విస్తీర్ణం పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో ఖాళీ స్థలం ఉన్నప్పటికీ అక్కడ వాహనాలను అనుమతించకుండా బారికేడ్లు వేశారు. ఇక్కడ వాహనాలు ఎవరైనా నిలిపితే రుసుం చెల్లించి మని బోర్డులు వేయడం విశేషం. ఏరియా ఆస్పత్రిలో వంద పడకల ఆసుపత్రికి భవనాలు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారు. ఆర్‌టిసి బస్టాండ్ చుట్టుపక్కల ప్రభుత్వాస్పత్రి, ఇరిగేషన్, సబ్ రిజిస్ట్రార్, ఆర్‌అండ్‌బి, తహశీల్దార్, ట్రెజరీ, రూరల్ పోలీస్ స్టేషన్, కోర్టు మున్సిపల్, మండల ప్రజా పరిషత్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యుఎస్ వంటి పలు కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. అయితే ప్రతి కార్యాలయానికి ప్రహరీ నిర్మించుకొని ఇచ్చట వాహనాలు నిలపరాదు అని సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఏదైనా పని మీద వచ్చిన వారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ తెలియక ఎవరైనా వాహనాలు నిలబెడితే పోలీసులు వాహనాలకు గాలి తీసి అపరాధ రుసుం వేస్తున్నారని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎండలు కూడా ఎక్కువగా ఉన్నాయి. దీంతో వాహనాలు ఎక్కడ నిలపలో తెలియక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధం అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



పార్కింగ్ స్థలం లేకపోవడంతో బస్టాండ్ వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాలు

**పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి**

జిల్లా కేంద్రంలో వాహనదారులకు వెంటనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా రోడ్డుప్రక్కన వాహనాలు ఉంచితే పోలీసులు ప్రత్యక్షమై అపరాధరుసుం వేస్తున్నారు. చిన్న చిన్న పట్టణాలలో కూడా స్థలం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలి.

**- సి.రాజేష్, వాహనదారుడు,చెన్నముక్కపల్లి, రాయచోటి.**



ఒప్పంద పత్రాలు చూపుతున్న మిట్స్ ప్రిన్సిపల్ యువరాజ్

## బెంగళూరు జిటిటిసితో 'మిట్స్' ఒప్పందం

**ప్రజాశక్తి-మదనపల్లి**

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్(మిట్స్) కళాశాల గవర్నమెంట్ టూల్ రూమ్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (జిటిటిసి) బెంగళూరు వారితో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. స్కిల్ బేస్డ్ ట్రైనింగ్, ఎడ్యుకేషన్, అసిస్ట్ ఇన్ ప్లేస్‌మెంట్, ఇండస్ట్రియల్ విజిట్, ఎక్స్‌పర్ట్ లెక్చర్ పరిధిలో సహకారంపై ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. డాక్టర్ రమేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శిక్షణ, గవర్నమెంట్ టూల్ రూమ్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (జిటిటిసి), రాజాజీనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఒప్పంద కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, డాక్టర్ కమలాబాషా ప్లేసెమెంట్ ఆఫీసర్ సుమన్ పాల్గొన్నారు.

## గజ వాహనంపై ఊరేగిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి

**ప్రజాశక్తి-పెద్దమండ్యం :** మండలంలోని పాపేపల్లి పంచాయతీలో కుశవతి నది తూర్పు తీరాన వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై గజ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో వేదమాత్రలతో, పిల్లనగ్రోవిలతో, బాణాసంచా వేడుకలతూ వివిధ పుష్పలతో అలంకరించి ఉరిపు గావించారు. కార్యక్రమంలో వాహన ఉబయదార్లు గల్లా శివ రామకృయ్య, గల్లన రసింహులు, గల్లా నారాయణ విహరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వై.విష్ణుమాచార్యులు, రఘునాధచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం : ఎంపీ

**ప్రజాశక్తి-నందలూరు**

రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట వైసిపి అభ్యర్థి ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆకేపాటి భరత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి, న్యాతిమ్మరాజుపల్లి, నడిగడ్డ అగ్రహారం, ఎల్లమరాజుపల్లి, కొండాయపల్లి హరిజనవాడ, మల్రిపల్లి, ఆడపూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా నల్లతిమ్మయ్యగారిపల్లిలోని పేట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం మొదలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని, రాజంపేట ఎమ్మెల్యేగా ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ప్రజల వద్దకే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజలు ఎవరు ఇబ్బందులు పడకుండా సంక్షేమ పాలన అందించిన సిఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జెసిఎస్ కన్వీనర్ కలీం, గడికోట సుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, దాదిరెడ్డి నర్సారెడ్డి, అరిగెల సౌమిత్రి, సిద్దవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, నడివీధి సుధాకర్, కృష్ణారెడ్డి, భాస్కర్ యాదవ్, పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, ఆనాల మధు యాదవ్, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఇబ్బు, మా భాష, ఓట్స్ శీను, గుండు గోపాల్ రెడ్డి, మధు రాజు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో టిడిపి ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-పెద్దమండ్యం**

మండలంలోని సి.కొత్తపల్లిలో టిడిపి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డికి మద్దతుగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు నార గంగాధర్, పవన్ కుమార్‌రెడ్డి, రైతు విభాగ అధ్యక్షులు తుమ్మల మహేశ్వర, పౌజులు రాజారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి రాయచోటి**

వేసవిని దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ వాసు బాబు పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ నీటి సరఫరా వెలిగల్లు స్కీమ్ ఇంటెక్ వెల్ ,ఎగువ గొట్టివీడు మంచినీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ వాసు బాబు పరిశీలించారు. వెలిగల్లు ఇంటెక్ వెల్‌లో మోటర్ల పని తీరు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లు పరిశీలించి గొట్టివీడు నీటిశుద్ధి కేంద్రలోనీటి నిల్వపై తీశారు. క్లోరిన్, ఆలమ్ వంటి నీటి శుద్ధి పదార్థాలు సరైన మోతాదులో వాడాలని సిబ్బందికి సూచించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళిక చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.ప్రజలకు అందించే నీటి శుద్ధి ప్రక్రియలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు . ఆయన వెంట మున్సిపల్ ఎఇ కృష్ణా రెడ్డి,మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున,వెలిగిళ్ళు వాటర్ స్కీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

**ప్రజాశక్తి-రామాపురం**

క్షయ వ్యాధిని మండలంలో నిర్మూలిద్దామని సోమవారం ప్రపంచానికి క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు మన మండలాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చాలని పేర్కొన్నారు. క్షయ వ్యాధికి నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎలియజెర్, పిహెచ్ఎన్ విజయ్ కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - రాయచోటి**

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్ ఫోన్ రిపేర్, సర్వీసింగ్, రిఫ్రిజిరేటర్ రిపేర్, సర్వీసింగ్, ఏసీ రిపేరు, సర్వీసింగ్‌లపై గ్రామీణ యువకులకు ఏప్రిల్ 22 నుంచి 30 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని బ్యాంకు డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కల గ్రామీణ నిరుద్యోగ యువకులు పై శిక్షణా కార్యక్రమాలకు అర్హులన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన నిరుద్యోగ యువకులు ఉచిత శిక్షణ తరగతుల కోసం తమ ఆధార్, రేషన్ కార్డుతో కడపలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ వివరాలను cbrsetikadapa@gmail. comకు మెయిల్ పంపి రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9440905478, 9985606866, 9440933028లలో సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

**ప్రజాశక్తి-మదనపల్లి**

ఈ నెల 27న మదనపల్లిలో జరిగే నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో జరిగిన స్థానిక విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేసేందుకు కోసం ప్రతి ఒక్క టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు అభిమానులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పుత్తూరు నుంచి మదనపల్లెకు హెలికాప్టర్లో వస్తారని తెలిపారు. బెంగళూరు బస్టాండులో ఇఫ్తార్ విందు అనంతరం 6.30 గంటలకు బస్టాండ్ వద్దనే బహిరంగ సభనిర్వహిస్తారని చెప్పారు. బహిరంగ సభలో ఎన్ఆర్‌సి, సిఎఎపై చంద్రబాబు స్పష్టత ఇస్తున్నట్లు తెలిపారు. మదనపల్లెను జిల్లాగా చేస్తామని చంద్రబాబునాయుడు ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్, ఎస్.ఎ.మస్తాన్, టివిఎస్ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, పులి మహాలక్ష్మి, రాదా, సాకే లక్ష్మీదేవి, జనసేన ఉభయ చిత్తూరు జిల్లా కార్యదర్శి శివరాం పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో నిస్సార్ అహమ్మద్

**ప్రజాశక్తి-మదనపల్లి :** సోమవారం సిటిఎం పంచాయతీ శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సిటిఎం పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని మదనపల్లి వైసిపి అభ్యర్థి నిస్సార్ అహ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమారరెడ్డి, శశాంక్‌రెడ్డి, ఎంపిపి వెలుగు చంద్రా రెడ్డమ్మ, సర్పంచ్ ఆనంద పార్థసారథి, మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పొగాకు ప్రతాప్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### రంజాన్ వేళలు



| ఇఫ్తార్ | షహరీ |
|---|---|
| మంగళవారం (సా) | బుధవారం (ఉ) |
| 6.30 | 5.01 |



రంగసముద్రంలో తనిఖీలు చేస్తున్న కేంద్ర బలగాలు

## కేంద్ర బలగాలతో తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం పరిధిలోని రంగసముద్రంలో సోమవారం ఎస్ఐ రవీందర్ బాబు ఆధ్వర్యంలో కేంద్ర బలగాల పోలీసులతో తనిఖీలు నిర్వహించారు. రంగసముద్రంలోని ప్రతి వీధిలోనూ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి, అనుమానం వచ్చిన వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలను తనిఖీలు చేసి రికార్డులు సక్రమంగా లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ రవీంద్రబాబు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు కేంద్ర బలగాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఊరిలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ప్రశాంతమైన పల్లెల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారు ఎంతటివారైనా కఠిన చర్యలతోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## వైసిపి ప్రభుత్వంలోనే మైనార్టీలకు పెద్దపీట

**- రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్**

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి ప్రభుత్వంతోనే మైనార్టీలకు పెద్దపీట వేశారని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని బండకాడపల్లి, క్రాస్ రోడ్డు, తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మండలంలో ఎంపిపి పదవి మైనార్టీలకు కేటాయించడం, మండలంలో ప్రతి మసీదులకు నిధులను కేటాయించడం, కొత్త ఈద్గాను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్పిటిసి పద్మజా లోకవర్ధన్, కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి వి.హరి, ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, వేంపల్లి బావాజీ, జెఎసి వ్యవస్థాపకుడు హనీఫ్, శివయోగ శివాజీ, సతీష్‌రెడ్డి, మధురెడ్డి, ఎంపిటిసి బోగేష్, మహల్ సర్పంచ్ తస్లిమ్ రియాజ్, కో-ఆప్షన్ నెంబర్ రిజ్వానా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

## పవన్ కల్యాణ్‌ను ఓడించలేరు

ప్రజాశక్తి-మదనపల్లె

ప్యాకేజీలకు అమ్ముడుపోయిన ముద్రగడ పద్మనాభం జనసేన పార్టీ నాయకులు పవన్ కల్యాణ్‌ను ఓడిస్తానన్నడం సిగ్గుచేటని బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఓడిస్తానడటం హాస్యాస్పందంగా ఉందన్నారు. వైసిపి ప్యాకేజీలకు అమ్ముడు పోయిన ముద్రగడ పద్మనాభం రాయలసీమ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి వస్తే కోడిగుడ్లు, టమోటాలతో స్వాగతం పలికేందుకోసం బలిజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్‌ను ఓడించడం ఎవరి వల్ల కాదని తెలిపారు. సమావేశంలో బలిజ సంఘం నాయకులు శ్రీరామ, ఆంజనేయులు, హరిప్రసాద్, గిరీష్, శేఖర్, బోర్వెల్ నాగరాజా, రమణ అర్జున్ పాల్గొన్నారు.

## ఆదరించండి మరింత అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-కలకడ

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను ఆదరించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేపడతామని ఎమ్మెల్యే రామచంద్రరెడ్డి తమ్ముడు శివానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీలోని ఎగువ కురవపల్లి, బద్దిరెడ్డిగారిపల్లి, గాలివీటివారిపల్లి, దిగువపాలెం, గుండావాండ్లపల్లి, హరిజనవాడ, మొర్రంమీదపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి ఏనుగొండ ఈశ్వర్ నాయుడు, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ రాజా, వాయల్పాడు పార్టీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, బివి.రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ హరినాథరెడ్డి, నాడించేర్ల ఎంపిటిసి కృష్ణారెడ్డి, సర్పంచ్ నరసింహారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

# 'వెలుగు'లో హోలీ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె మండలం కోళ్ళ బైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో హోలీ పండుగ సంబరాలు చిన్నారులు, వృద్ధులు ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ జరుపుకున్నారు. వెలుగు ప్రాంగణమంతా ఎన్నో రంగులతో హోలీ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు అందరూ రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు ఒకరికొకరు తినిపించుకొంటూ ఆనందంగా హోలీ పండుగను జరుపుకున్నారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి హోలీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వెలుగు సంస్థ సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ లీనా కుమారి, చిన్నారులు, వృద్ధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

**పీలేరు:** పట్టణంలో హోలీ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పండుగను సత్యయుగం నుంచి జరుపుకుంటున్నట్లు హిందూ పురాణాలు చెబుతున్నాయన్నారు. హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని అర్థమని తెలిపారు. హోలీని 'హోళికా పూర్ణిమ'గా కూడావ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పండుగ ముఖ్యమైన హిందూ పండుగల్లో ఒకటని పేర్కొన్నారు. దీన్ని రంగుల, ప్రేమ, వసంతాల పండుగగా జరుపుకుంటారని తెలియజేశారు. పీలేరు నియోజకవర్గ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని మార్వాడీలు కూడా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహల మధ్య ఈ వేడుకలను చేసుకున్నారు. వీధుల్లో తిరుగుతూ రంగులు చల్లుకున్నారు.




మదనపల్లి : హోలీ వేడుకలు నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

# అడుగంటిన చెరువులు.. తాగునీటికి కష్టాలు..!

ప్రజాశక్తి - ఖాజీపేట

గతేడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల జలాశయాల్లో చుక్క నీరు లేక వెలవెల బోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఎడారులను తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన అడపాదడపా వర్షాల వల్ల కేసీ కెనాల్ ఆయకట్టుకు ఆరుతడి పంటలకు నీరివ్వడంతోపాటు తాగు నీటి అవసరాల దృష్ట్యా చెరువులకు అరకొరగా నీటిని నింపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయాయి. ఆయా గ్రామాల్లో తాగు నీటి కష్టాలు అధికమయ్యాయి. తాగు నీటి బోర్లల్లో చుక్క నీరు రావడం లేదు. చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని నింపి ఉంటే తాగు నీటికి కష్టాలు ఉండేవి కావని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పెన్నా నదిలో చుక్కనీరు లేకపోవడంతో పెన్నా తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు కూడా అరకొరగా అందుతోంది. గతంలో ఎన్నడూ లేనంత దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు వాపోతున్నారు. వేసవి ప్రారంభ దృష్ట్యా ముందుచూపు లేకపోవడం కూడా తాగునీటికి మరో కారణమని ప్రజలు భావిస్తున్నారు.



జలకళలేక వెలవెల బోతున్న రావులపల్లె చెరువు

# పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి : ఎంపీ



పార్టీలో చేరిన వారితో ఎంపీ, సతీష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి నేత, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాల్లోని ఆయన అనుచరులు సోమవారం భారీ సంఖ్యలో టిడిపి నుండి వైసిపిలో చేరారు. వీరికి ఎంపీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నేటి నుండి ప్రతిరోజు వైసిపిలో చేరికలు మొదలవుతాయని తెలిపారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి వైసిపి కుటుంబం సాదరంగా స్వాగతం పలుకుతుందన్నారు. సతీష్‌రెడ్డి అన్న ఆలోచనలు తన ఆలోచనలు ఒకటే అన్నారు. సతీష్‌రెడ్డితో కలిసిన పని చేసిన వారందరు వైసిపిలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సతీష్‌రెడ్డి గౌరవపదమైన, సౌమ్యంగా ఉండే వ్యక్తి అని తెలిపారు. ఈనెల 27న ఇడుపులపాయలో ప్రారంభమయ్యే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపినేత సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వర ప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**పలువురు టిడిపి నుండి వైసిపిలో చేరిక**

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని నగిరిగుట్ట 26 వార్డు, 31వ వార్డులకు సంబంధించి నగరిగుట్ట పరిధిలోని కౌన్సిలరు లక్ష్మీ ప్రసన్న, వైసిపి నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో కీర్తి శేషులు నాగస్వరం మహేష్ కుటుంబ సభ్యులు సుజాత, తరుణ్ చంద్ర, హర్ష భల్లె నారాయణ, ప్రసాద్ కుటుంబ సభ్యులు, క్రిస్టియన్ లైన్ సంబంధించి కోలా ప్రసాద్, అశోక్ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 50 కుటుంబాలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసం వద్ద వైసిపిలో చేరాయి. టిడిపి నుండి వైసిపిలో చేరిన వీరికి ఎంపీ, వైఎస్ మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అక్కడికి వచ్చిన పలువురి సమస్యలను విని వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వర ప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్ణయం సరైందికాదు

ప్రజాశక్తి - చాపాడు

విద్యుత్ అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆవుల వెంకటరమణ పేర్కొన్నారు. చాపాడు మండలం వెదురూరు రాజుపాలెం గ్రామంలో రైతుల కోరిక మేరకు ఆయన పర్యటించారు. 9 గంటల విద్యుత్‌కు బదులు 7 గంటలు కూడా అరకొరగా మాత్రమే సరఫరా చేస్తున్నారని వాపోయారు. గంటకు ఒకసారి లైన్‌కట్ అవుతుందని రైతులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకటి పోటు అనేలా 7 గంటల కరెంటును కూడా నాలుగు గంటలకే మార్చడం భావ్యం కాదన్నారు. దీనిపై కడప జిల్లా విద్యుత్ అధికారులతో మాట్లాడగా పోట్లదుర్తి గ్రామం నుండి కడప వరకు పెన్నా నది తీర గ్రామాలకు విద్యుత్తును తగ్గించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారన్నారు. కడప పట్టణ ప్రజలకు తాగునీటి కోసం మైలవరం నుండి పెన్నా నది ద్వారా కడప చెరువుకు నీటిని తీసుకెళ్తున్నందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందన్నారు. పైరు పూతదశకు, పంట దశకు వచ్చే సమయంలో విద్యుత్ అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసుకొని రైతులకు ఏడు గంటల కరెంటు విధానాన్ని అమలు చేయాలని రైతు నాయకులు కోరారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు నియోజకవర్గ నాయకులు అహ్మద్, రాజుపాలెం రైతులు ఎంగిశెట్టి శ్రీధర్ బాబు, గోపాల్ రెడ్డి, తిరుపతి నరసింహ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, ప్రసాద్, శివ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

## రంగు మారని నీటిని సరఫరా చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణ ప్రజలకు రంగుమారని తాగునీటిని సరఫరా చేయాలని సోమవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో కోరారు. కుళాయిలకు మురికినీరు వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో చాలా రోజులు నుండి మురికి నీరు తాగునీటి కుళాయిలలో వస్తున్నా మున్సిపాలిటీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు మంచినీరు పరిశుభ్రతకు వాడే కెమికల్ అయిపోయిందని చెబుతున్నారని తెలిపారు. చాలా రోజులు నుండి రంగుమారిన నీరు ఇలా వస్తుంటే ఇంకెప్పుడు వస్తుంది కెమికల్ అని ప్రశ్నించారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే ఆ భాధ్యత ఎవరిదన్నారు. మున్సిపాలిటీ అధికారులు మంచి నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం :'యనమల'



మాట్లాడుతున్న భాస్కరరావు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా ఎజెండా అని జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కరరావు అన్నారు. సోమవారం తులసీరామ్ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఇదే నియోజకవర్గంలోని పెనగలూరు మండలం ఎన్ఆర్.పురం గ్రామానికి చెందిన దళితుడని చెప్పారు. తనపై నమ్మకంతో జనసేన అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఆయన ఆశీస్సులతో తప్పక మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎంపిక చేశారని అన్ని పార్టీల మద్దతుతో గెలిచి ఐదు మండలాల అభివృద్ధికి నిరంతరం పాటు పడతానన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు దినకర్ బాబు, దాశరథి, సభాపతి, ఉత్తరాది శివ, రవిచంద్ర టిడిపి నాయకులు మాజీ సర్పంచి శంకరయ్య నాయుడు, మహిళ నాయకులు ఇందిర, రమేష్, చిన్న, సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

## అరాచక పాలనను తరిమికొడదాం : 'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

వైసిపి అరాచకపాలనను తరిమికొడదామని తంబళ్లపల్లె టిడిపి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం సోమవారం ములకలచెరువు పార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, సీనియర్ నాయకులతో ఆయన విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా మండలాల నాయకులతో సమీక్ష జరిగి పార్టీ కోసం వారు పడిన బాధలు ఆలకించి భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలా ఆదుకోవాలనే అంశాలపై కూలంకషంగా చర్చించారు. రామ రాజ్యం కోసం పోరాడుదామన్నారు. రావణ పాలనను తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అబ్జర్వర్ గురువారెడ్డి మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు కాలం చెల్లిందని తెలిపారు. భూ దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, ఇసుక, మైనింగ్ మాఫియా, పేదల భూముల ఆక్రమణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చమరగీతం పాడటానికి సిద్ధమయ్యారని చెప్పారు.

## రాష్ట్రాన్ని మాఫియా కేంద్రంగా మార్చేశారు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్ మాఫియా కేంద్రంగా మార్చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. జగన్ పాలనలో మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా ఆ మూలాలన్నీ జగన్మోహన్‌రెడ్డి పాలన తీరు తెలిపేలా ఉంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా, కిల్లి కొట్టులోకి వెళ్లినా గంజాయి డ్రగ్స్ దొరుకుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం విక్రయించే నాసిరకం మద్యం తాగడంతో పలువురు పేదలు కూడా మరణించారన్నారు. కొంతమంది రోజువారి కూలీలు ఇల్లు పోగొట్టుకుని రోడ్డున పడ్డారని ఆరోపించారు. గంజాయి డ్రగ్స్‌తో కోట్ల రూపాయలు దోచుకోవాలనే ఉద్దేశంతో జగన్ ఒక ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసుకొని పాఠశాల పిల్లల నుంచే విద్యార్థులను, యువతను టార్గెట్ చేసుకొని వారిని గంజాయి డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పి రాష్ట్రం నుంచి తరిమి తరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఘనంగా ముక్కంటేశ్వర తిరుణాల

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీముక్కంటేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం మొదలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ముక్కంటేశ్వర స్వామి వారికి కల్యాణోత్సవం తదుపరి చదివింపుల కార్యక్రమం, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. వసంతోత్సవం సందర్భంగా స్వామి వారి ఊరేగింపు, నరసాపురం గ్రామస్తులచే సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నమ్మ హరికథ లాంటి అహ్లాదకరమైన కార్యక్రమాలు జరుపుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో అన్నదానం, తీర్థ ప్రసాదాసాదాలు వినియోగం, స్వామివారి ఊరేగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డ్యాన్ బేబీ డ్యాన్స్, హరికథా కాలక్షేపం, నరసాపురం, జక్కలవారిపల్లె వారిచే జాణపద కోలాటాలు కాలక్షేపం. 26వ తేదీ స్వామివారి రథోత్సవం సందర్భంగా 27వ తేదీ అందజేస్తారు.



ముక్కంటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

# క్రైం కార్నర్

## మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడు బస్టాండ్ ఆవరణంలో పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పూలకుంట పంచాయతీ బండమీదపల్లికి చెందిన అన్నం ఉత్తరెడ్డి పది మద్యం బాటిళ్లు కల్గి ఉండడంతో స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశామని చెప్పారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గాలివీడు

పేకాట స్థావరంపై సోమవారం పోలీస్ స్టేషన్ సిబ్బంది దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5,900 నగదు కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని మంగళవారం రిమాండ్‌కు పంపుతున్నామని పేర్కొన్నారు.

## బెదిరింపుపై కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

తూముకుంట పంచాయతీ కొండ కింద పల్లి కి చెందిన పేల నాగేశ్వరమ్మ భర్త నారాయణ సోమవారం గాలివీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు వారి కుమార్తె పచ్చిపాల నాగరత్నమ్మను గుత్తి ప్రసాద్ కొట్టి, చంపుతానని తన కుమార్తెను బెదిరిస్తున్నాడని బాధితులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

## నిప్పంటించుకున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

గురుకొండ మౌలాలి (32) ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. గాయాలు కావడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్ఐ విఎల్ ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దమండెంకు చెందిన గుర్రంకొండ మౌలాలికి పదేళ్ల కిందట చిన్నమండెంకు చెందిన వహిదాతో వివాహమైంది. వారికి ఇంతవరకు పిల్లలు పుట్టలేదు. భార్యాభర్తలు ఇరువురు కలసి ముస్లిమ్ సంప్రదాయం ప్రకారంగా 40 రోజుల కిందట విడాకులు తీసుకున్నారు. మృతుడి తల్లి రెండు సంవత్సరాల కిందట కువైట్ కు వెళ్ళింది. 'నాకు కొత్త ఇల్లు కొనివ్వు నేను నా భార్యను కాపురానికి పిల్లంపుకుంటాను' అని తన తల్లికి ఫోన్ చేసి చెప్పేవాడు. ఆమె తన వద్ద అంత డబ్బు లేదని కుమారుడితో ఫోన్లో చెప్పారు. తల్లి ఇల్లు కొనివ్వకపోవడం, భార్య కాపురానికి రాకపోవడంతో మనుస్తాపం చెంది ఈనెల 17 న ఐరస్‌హోటల్ వద్ద పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. వెంటనే పుత్తుకూరుపల్లి చెందిన బసిరెడ్డి మరికొందరు కలసి మంటను ఆర్పివేసి తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.